క్లుప్తంగా

విద్యా ప్రాంగణం శుభ్రం చేయాలి



ఎంపీయూపీ పాఠశాల ఆవరణలో దట్టంగా పెరిగిన గడ్డి

కొయ్యలగూడెం: స్థానిక కన్నాపురం రోడ్డులో ఉన్న ఎంపీపీ స్కూల్ ప్రాంగణాన్ని శుభ్రం చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. పాఠశాల ఆవరణ పిచ్చి మొక్కలు, గడ్డి పెరిగి అధ్వానంగా ఉందన్నారు. సమీపంలోనే చెరువు ఉండడం వలన విష సర్పాలు, క్రిమి కీటకాల సంచారం ఎక్కువగా ఉందని స్థానికులు పేర్కొన్నారు. ఉపాధి పనుల్లో కూలీల ద్వారా పాఠశాల ప్రాంగణాన్ని శుభ్రం చేయించాలని కోరుతున్నారు. ఇదే విధంగా 9వ వార్డు ఎంపీపీ స్కూల్ పరిస్థితి కూడా అధ్వానంగా ఉందని అందులో కూడా ఉపాధి పనుల ద్వారా శుభ్రం చేయించాలని కోరుతున్నారు.

నూతన ఎస్సై బాధ్యతల స్వీకరణ



ఎస్సై సతీష్‌కుమార్

చింతలపూడి: చింతలపూడి ఎస్సైగా కె.సతీష్ కుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఆయన టి.నరసాపురం, తడికలపూడి, ద్వారకాతిరుమల, గోపాలపురం పోలీస్ స్టేషన్లలో ఎస్సైగా పని చేశారు. ఇప్పటి వరకు ఇక్కడ పని చేసిన కుటుంబరావు స్థానంలో సతీష్‌కుమార్ బదిలీపై వచ్చారు. పట్టణంలో ట్రాఫిక్ సమస్య, అసాంఘిక కార్యకలాపాల నిరోధంపై ప్రత్యేక దృష్టి పెడతానని తెలిపారు.

నగర పంచాయతీ కమిషనర్ కార్యాలయం ప్రారంభం

చింతలపూడి: నూతనంగా ఆధునీకరించిన చింతలపూడి నగర పంచాయతీ కమిషనర్ కార్యాలయాన్ని ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ శుక్రవారం ప్రారంభించారు. అనంతరం జిల్లా పరిషత్ సుబ్బరాజు హైస్కూల్ విద్యార్థులకు డాక్టర్ సర్వేపల్లి రాధా కృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థికీ విద్యార్థి మిత్ర కిట్లను అందజేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంఈఓలు జి.రామారావు, కిరణ్ బాబు, పాఠశాల హెచ్‌ఎం విజయ భారతి, తదితరులు పాల్గొన్నారు.

నేడు కొయ్యలగూడేనికి సత్యసాయి రథం



శ్రీసత్య సాయి ప్రేమ ప్రవాహిని రథం

కొయ్యలగూడెం: శ్రీసత్య సాయి ప్రేమ ప్రవాహిని రథం శనివారం కొయ్యలగూడేనికి చేరుకోనుందని శ్రీసత్యసాయి సేవా సంస్థ సభ్యులు పేర్కొన్నారు. సత్యసాయి శత జయంతి వేడుకల్లో భాగంగా దేశ వ్యాప్త రథయాత్ర నిర్వహిస్తున్నారన్నారు. కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు మూడు నెలల పాటు పలు పుణ్య క్షేత్రాల్లో రథయాత్ర కొనసాగుతుందన్నారు. ఏలూరు జిల్లాలో 14వ తేదీ నుంచి 17వ తేదీ వరకు రథయాత్ర జరుగుతుందని, భక్తులు స్వామి వారి మందిరం వద్దకు చేరుకోవాల్సిందిగా పిలుపు ఇచ్చారు.

నేడు ముత్యాలమ్మకు జలాభిషేకం



ముత్యాలమ్మను దర్శించుకుంటున్న భక్తులు

జంగారెడ్డిగూడెం: శ్రీచక్ర సహిత ముత్యాలమ్మకు శుక్రవారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముత్యాలమ్మ ఉత్సవ విగ్రహానికి పంచామృత ఏకవార రుద్రాభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్మాణ కర్త బవిరిశెట్టి మురళీకృష్ణ మాట్లాడుతూ ఈ నెల 14వ తేదీ శనివారం ఉదయం 8 గంటలకు అమ్మవారికి సప్తనది జలాలతో పంచామృతాలతో అభిషేకం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పూజా కార్యక్రమాలు బ్రహ్మశ్రీ బాదంపూడి వెంకట సూర్య సీతారామశర్మ పర్యవేక్షణలో నిర్వహిస్తారన్నారు. కావున ఈ కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ హాజరు కావాలని కోరారు.

సంక్షేమ పథకాలు వర్తింపజేయాలి

అంగన్‌వాడీల ధర్నా.. వినతి పత్రాల అందజేత



జంగారెడ్డిగూడెం: వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు



బుట్టాయగూడెం: తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీ వర్కర్లు

జంగారెడ్డిగూడెం: అంగన్‌వాడీ వర్కర్ల పిల్లలకు తల్లికి వందనం, సంక్షేమ పథకాలు అమలు చేయాలని వారు కోరారు. శుక్రవారం జంగారెడ్డిగూడెం తహసీల్దార్ కార్యాలయంలో కార్యాలయ అధికారికి అంగన్‌వాడీలు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కె.సుబ్బారావమ్మ మాట్లాడుతూ అంగన్‌వాడీలు గర్భిణులకు, బాలింతలు, చిన్న పిల్లలకు అనేక సేవలందిస్తున్నారన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా అంగన్‌వాడీలకు వేతనాలు పెరగలేదన్నారు. 12వేల లోపు ఆదాయం ఉన్న వారందరికీ సంక్షేమ పథకాలు, తల్లికి వందనం అమలు చేస్తామని ప్రభుత్వం నిర్ణయించిందని, అంగన్‌వాడీ వర్కర్లకు రూ.11,500, హెల్పర్, మినీ వర్కర్లకు రూ.7,000 గౌరవ వేతనం మాత్రమే ఇస్తున్నారన్నారు. కానీ అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా నమోదు చేసి, సంక్షేమ పథకాలు అమలు చేయకపోవడం దుర్మార్గమైన చర్య అని పేర్కొన్నారు. అంగన్‌వాడీ పిల్లలకు తల్లికి వందనం కానీ, రిటైర్ అయిన వారికి పింఛన్ కాని రావడం లేదన్నారు. రేషన్ కార్డులకు దరఖాస్తు చేసుకుంటే ప్రభుత్వ ఉద్యోగులని తిరస్కరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారన్నారు. కావున అంగన్‌వాడీలకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరుతూ జూన్ 16న కలక్టరేట్ వద్ద నిర్వహించే ధర్నాలో అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు, మినీ వర్కర్లు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అధ్యక్షురాలు జి.బేబీరాణి, పి.శాంతి, ఎంఎస్ కుమారి, ఎన్.దేవి, పి.కృష్ణ కుమారి, పట్టణ సీఐటీయూ అధ్యక్షుడు పి.సూర్యారావు, ప్రాజెక్టు అధ్యక్షురాలు జి.విమల, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల ధర్నా

బుట్టాయగూడెం: తల్లికి వందనం పథకంతో సహా అన్ని ప్రభుత్వ సంక్షేమ పథకాలు అంగన్‌వాడీలకు వర్తింపజేయాలని కోరుతూ సీఐటీయూ, ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు శుక్రవారం సాయంత్రం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా సంఘాల నాయకులు మాట్లాడుతూ చాలీచాలని జీతంతో విధులు నిర్వహిస్తున్న తమకు ప్రభుత్వం అమలు చేస్తున్న అన్ని పథకాలు అమలు చేసేలా కృషి చేయాలని వారు కోరారు. అనంతరం తహసీల్దార్ పీవీ చలపతిరావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ, ఐఎఫ్‌టీయూ సంఘాల నాయకులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలి



తహసీల్దార్ కార్యాలయ అధికారికి వినతిపత్రం అందజేస్తున్న పేదలు

టి.నరసాపురం: గత 17 ఏళ్లగా టి.నరసాపురం పంచాయతీ పరిధిలో ప్రభుత్వ భూమిలో పూరిగుడిసెలు వేసుకొని ఉంటున్న నిరుపేదలకు పట్టాలు ఇవ్వాలని సీపీఎం మండల కార్యదర్శి మడకం సుధారాణి, జిల్లా కమిటీ సభ్యుడు గుడెల్లి వెంకటరావు అన్నారు. ఈ మేరకు తహసీల్దార్ కార్యాలయం వద్ద ఏఎస్ఆర్ నగర్ వాసులు దరఖాస్తులు పెట్టుకున్నారని వారు తెలిపారు. ప్రభుత్వ జీవో ఎంఎస్ నంబర్ 30 ప్రకారం పేదల సాగులో ఆక్రమణలో ఉన్న స్థలాలు రెగ్యులర్ చేయాలని జీవోను అనుసరించి ఏఎస్ఆర్ నగర్ ప్రజలకు ఇంటి పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు, మండల కమిటీ సభ్యులు మడకం కుమారి, శిరీష, అనుమోలు మురళి, పట్ల మంగ, కుమారి పాల్గొన్నారు.

ముంపు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ ఎంవీ రమణ

కుక్కునూరు: గోదావరికి వరద ప్రారంభం అయిన వెంటనే వరద తీవ్రత పెరగక ముందే గొమ్ముగూడెం, లచ్చిగూడెం గ్రామస్తులు అప్రమత్తమై, రాయికుంటలో వరద సహాయక కేంద్రంలో ఉండాలని ఆర్డీఓ ఎంవీ రమణ నిర్వాసితులకు సూచించారు. శుక్రవారం ఆర్డీఓ రాయికుంట ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో గొమ్ముగూడెం, లచ్చిగూడెం గ్రామస్తులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ గొమ్ముగూడెం, లచ్చిగూడెం గ్రామాలపై వరద ప్రభావం ఉంటుందని నిర్వాసితులు ముందుగానే రాయికుంట ఆర్‌అండ్‌ఆర్ కాలనీకి రావాలని సూచించారు. దీంతో సరేనన్న గ్రామస్తులు ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో ఎదుర్కొంటున్న సమస్యలను ఆర్డీఓకు వివరించారు. కాలనీలో బాత్రూమ్‌లు ఏర్పాటు చేయాలని, మూగజీవాలకు దాణా, హ్యాండ్ పంపులు, మంచినీటి కోసం బోరును, పునరావాస సహాయక కేంద్రంలో ఉన్నన్ని రోజులూ పనులు లేక ఖాళీగా ఉండకుండా ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా ఉపాధి పనులు కల్పించాలని కోరారు. సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని ఆర్డీఓ హామీ ఇచ్చారు. అంతేకాక ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో విద్యుత్ సౌకర్యం కల్పించి లైట్లు ఏర్పాటు చేయాలని ఏఈకి సూచించారు. అనంతరం కుక్కునూరు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అనంతరం సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఆర్డీఓ వెంట కుక్కునూరు తహసీల్దార్ కె.రమేష్ బాబు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

మాస్టర్ ప్లాన్ పరిశీలించిన చైర్‌పర్సన్



మాస్టర్ ప్లాన్ పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ బత్తిన లక్ష్మి

జంగారెడ్డిగూడెం: భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకుని మాస్టర్ ప్లాన్ ఏర్పాటు చేశామని మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి అన్నారు. మున్సిపాలిటీకి సంబంధించి మాస్టర్ ప్లాన్‌ను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ అన్ని రకాల మౌలిక వసతులతో కూడిన విధంగా మాస్టర్ ప్లాన్ రూపొందించామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటరమణ, కౌన్సిలర్లు చిటికెల అచ్యుత రామయ్య, పీపీఎన్ చంద్రరావు. కనుమూరి లావణ్య, నేత్రు గణేష్ యాదవ్, నాయకులు బత్తిన చిన్న, పెసరగంటి త్రిమూర్తులు పాల్గొన్నారు.

నూతన పైప్‌లైన్ పనులు

పట్టణంలో నిరంతరం అభివృద్ధి పనులు కొనసాగుతాయని మున్సిపల్ చైర్‌పర్సన బత్తిన లక్ష్మి అన్నారు. జంగారెడ్డిగూడెం పట్టణంలో తాగునీటి కోసం వేస్తున్న నూతన పైపలైన్‌ను శుక్రవారం చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి పరిశీలించారు. కార్యక్రమంలో పట్టణ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు చిటికెల అచ్యుత రామయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు బత్తిన చిన్న, పెసరగంటి త్రిమూర్తులు, నేత్రు గణేష్, ఏఈ రాజేష్, ఈఈ ఫణిభూషణరావు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

పోడు భూములకు పట్టాలు ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు ఎండీ మునీర్

వేలేరుపాడు: పోడు భూములకు పట్టాలు ఇవ్వడంతో పాటు తల్లికి వందనం అందరికీ వర్తించేలా చర్యలు చేపట్టాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు ఎండీ మునీర్ అన్నారు. వేలేరుపాడు సీపీఐ కార్యాలయంలో మండల కౌన్సిల్ సమావేశం మడివి కామయ్య అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ సమావేశానికి సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు ఎండీ మునీర్ మాట్లాడుతూ అనేక ఏళ్లుగా గిరిజనులు సాగు చేస్తున్న పోడు భూములకు పట్టాలు ఇచ్చి, ప్రభుత్వం వారికి విత్తనాలు, ఎరువులు సబ్సిడీపై ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే తల్లికి వందనం పథకంలో భాగంగా అందరి పిల్లలకు రూ.15 వేలు ఇస్తానన్న మాటను నిలబెట్టుకోవాలన్నారు. విద్యుత్ వినియోగం ఎక్కువ అంటూ, నాలుగు చక్రాల వాహనం ఉందంటూ, పలు కారణాలు చూపుతూ అనేక మందిని ఈ పథకానికి అనర్హులను చేయడం సమంజసం కాదన్నారు. ఉపాధి హామీలో పని చేసిన కూలీలకు వెంటనే నగదు చెల్లించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా, మండల నాయకులు కారం దారయ్య, పిట్టా ప్రసాద్, బాడిశ రాము, పిట్టా వీరయ్య, కరాటం వెంకటేశ్వరరావు, కురిమెళ్ల వెంకటేశ్వర్లు, బంధం నాగేశ్వరావు, సోడే ప్రసాద్, బుడిపిటి జాన్‌బాబు, కాక ముత్యాలరావు, తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ ఆస్తులను కాపాడండి

టి.నరసాపురం: బొర్రంపాలెం గ్రామ పంచాయతీకి చెందిన అసైన్‌మెంట్ భూమి ఆక్రమణలకు గురైందని, వెంటనే వాటిని స్వాధీనం చేసుకోవాలని సామాజిక కార్యకర్త గుండె పాండు రంగ కోరారు. పంచాయతీకి సంబంధించిన అసైన్‌మెంట్ భూమి 50 సెంట్ల స్థలాన్ని సచివాలయం -1, ఆర్‌బీకే, డిజిటల్ లైబ్రెరీ, బల్క్‌మిల్క్ సెంటర్, ఇతర ప్రభుత్వ భవనాల నిర్మాణాలకు పంచాయతీ తీర్మానం చేసిందన్నారు. ఆ భూమిలో సచివాలయం-1, ఆర్‌బీకేలు నిర్మించి, డిజిటల్ లైబ్రెరీకి పునాదులు తవ్వారని, బల్క్‌మిల్క్ సెంటర్ నిర్మాణానికి జియో ట్యాగింగ్ చేశారన్నారు. అయితే ఆ స్థలంలో అక్రమార్కులు అనధికార నిర్మాణాలు చేస్తున్నారన్నారు. అధికారులు స్పందించి ఆక్రమణలను తొలగించి పంచాయతీ స్థలాన్ని కాపాడాలన్నారు.

ప్రైవేట్ విద్యా సంస్థల దోపిడీని అరికట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న లెనిన్

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెంలో ప్రైవేట్ విద్యా సంస్థల ఫీజులు పుస్తకాల దోపిడీని అరికట్టాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక జంగారెడ్డిగూడెం యూటీఎఫ్ కార్యాలయంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె.లెనిన్ మాట్లాడుతూ ప్రైవేట్ విద్యా సంస్థల యాజమాన్యాలు పుస్తకాలను బయట కొంటే సిలబస్ మారిపోతుందని విద్యార్థుల తల్లిదండ్రులను మభ్యపెడుతున్నారని తెలిపారు. వంద రూపాయలకు దొరికే పుస్తకాన్ని రూ.200, రూ.250 విక్రయిస్తున్నారని, అవి సరిపోవంటూ యూనిఫామ్ పేరుతో మరో రూ.2000 వసూలు చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రైవేట్ విద్యా సంస్థలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని లేకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు పి.పవన్, సహాయ కార్యదర్శి బి.మనోజ్, జిల్లా నాయకురాలు జి.రమ్య, కె.అమూల్య, పి.సతీష్, పి.సుందర్‌పాల్, కె.అశోక్ తదితరులు పాల్గొన్నారు.

నేడు జెడ్పీ హైస్కూల్‌లో యోగాంధ్ర

బుట్టాయగూడెం: యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా బుట్టాయగూడెం మండలంలోని 18 సచివాలయాల పరిధిలో నేడు (శనివారం) యోగా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ కె.జ్యోతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 6 గంటలకు మండలంలోని అన్ని సచివాలయాల పరిధిలో ఈ యోగా కార్యక్రమం నిర్వహిస్తారని చెప్పారు. దీనికి సంబంధించి అన్ని శాఖల అధికారులను నియమించినట్లు తెలిపారు. బుట్టాయగూడెం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో నిర్వహించే ఈ కార్యక్రమంలో సచివాలయాల పరిధిలో ఉన్న అధికారులు పాల్గొనాలని ఆమె కోరారు.

సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి



ధర్నా చేస్తున్న సంఘ నాయకులు

జంగారెడ్డిగూడెం: భవన నిర్మాణ కార్మిక సంక్షేమ పథకాలు వెంటనే అమలు చేయాలని ప్రగతి శీల భవన ఇతర నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కేవీ రమణ డిమాండ్ చేశారు. సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని కోరుతూ శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం ముందు కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కేవీ రమణ మాట్లాడుతూ సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు ఏర్పాటు చేయబడ్డ భవన నిర్మాణ సంక్షేమ బోర్డు 2018లో నిలిపి వేశారన్నారు. పథకాన్ని నిలిపి వేయడం వలన ఇబ్బందులు పడుతున్నారన్నారు. అనంతరం తహసీల్దార్ కె.స్లీవజోజికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు సరియం రామ్మోహన్, మంచిలి రాజు, కోర్లి రాంబాబు, యాదాల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రమాదకర మలుపులు.. మృత్యు మార్గాలు

- మండల పరిధిలో 17 మలుపులు.. తరచూ ప్రమాదాలు
- జిల్లాలో ప్రధాన రోడ్డుగా చేబ్రోలు-ఉండి ఆర్‌అండ్‌బీ రహదారి



నారాయణపురం ఐస్ ఫ్యాక్టరీల వద్ద ఉన్న మలుపు

ఉంగుటూరు: జిల్లాలో ప్రధాన రహదారుల్లో ఒకటిగా మారిన ఉండి-చేబ్రోలు ఆర్‌అండ్‌బీ రహదారి మలుపుల మయంగా ఉంది. పెరిగిన రద్దీ విపరీతమైన స్పీడుతో నడిచే వాహనాల నేపథ్యంలో ఏ సమయంలో ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రయాణికులు భయాందోళనకు గురవుతున్నారు. ఉంగుటూరు మండలం సీతారామపురం నుంచి గొల్లగూడెం శివారు వరకు ఈ ఆర్‌అండ్‌బీ రహదారి విస్తరించి ఉంది. సుమారు 20 కిలో మీటర్ల మేర 17 ప్రమాదకర మలుపులు ఉన్నాయి. ఇవన్నీ ప్రమాద సూచికలుగా ఉన్నాయి. వెను వెంటనే రెండు, మూడు మలుపులు కొన్ని చోట్ల ఉన్నాయి. రాచూరు నుంచి రావులపర్రు, తోకలపల్లి కోడు మధ్యలో నాలుగు మలుపులు ఉన్నాయి. అలాగే రావులపర్రు నుంచి నారాయణపురం చేరే లోపు ఏడు మలుపులు ఉన్నాయి. నారాయణపురం నుంచి గొల్లగూడెం చేరే లోపు పది మలుపులు ఉన్నాయి. ఈ మలుపులను దాటుకొని ప్రయాణం చేయడం గగనంగా మారింది. పూర్వం ఇసుక పుంత రహదారిగా ఉన్న ఈ రోడ్డును చింతలపాటి మూర్తిరాజు ఎమ్మెల్యేగా ఉండగా తారు రోడ్డు నిర్మించారు. ఆ సమయంలో డెల్టా ప్రాంత పశువులను మెట్ట ప్రాంతాలకు ఈ రహదారి గుండా తరలించేవారు. అలాగే గడ్డి బళ్లు, ఇతర రవాణాకు రైతులు ఈ రహదారిని ఉపయోగించే వారు.

ప్రధాన రహదారిగా మారిన వైనం

పెరిగిన వాహనాల రద్దీ దృష్ట్యా డెల్టాకు, మెట్ట ప్రాంత గ్రామాలకు ప్రధాన రహదారిగా మారిపోయింది. భీమవరం-జంగారెడ్డిగూడెం పట్టణాలకు ప్రధాన రహదారి అయ్యింది. ఆర్టీసీ బస్సులు నడుస్తున్నాయి. వందలాది లారీలు తిరుగుతున్నాయి. కార్లు, ద్విచక్ర వాహనాలు వేలాదిగా నడుస్తున్నాయి. ఆక్వా రంగానికి చెందిన వందలాది లారీలు ఈ రహదారి మీదుగా నడుస్తున్నాయి. ఏ మాత్రం వేమరపాటు తనంతో ఈ రహదారిలో వాహనం నడిపినా ప్రమాదానికి గురైనట్లే. ఇప్పటికే ఎన్నో ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. ఎంతో మంది ప్రాణాలు కోల్పోయారు. ఎంతో మంది క్షతగాత్రుల య్యారు. ఇంత ప్రాధాన్యత సంతరించుకున్న ఈ ఆర్‌అండ్‌బీ రహదారికి పొంచి ఉన్న మలుపులు సరి చేయాల్సిన అవసరం పాలకులపై ఉందని ప్రయాణికులు చెబుతున్నారు. ఆర్‌అండ్‌బీ అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకున్న దాఖలాలు లేవు. ప్రజల పట్ల మృత్యు పాశాలుగా ఉన్న మలుపులు తొలగించి రహదారి కనిపించేలా సరి చేయాలని పాలకులను వేడుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ఉండి ఎమ్మెల్యే, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు ఈ రహదారి మీదుగా వెళుతుంటారు. రాచూరు వద్ద ఆయన స్వయంగా ఎర్కొన్న ట్రాఫిక్ సమస్య దృష్ట్యా జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో వాటి మీద ఆర్‌అండ్‌బీ అధికారులు రాచూరు మలుపుల వద్ద రమదారి విస్తరణకు ప్రతిపాదన ప్రభుత్వానికి పంపారు. ఈ మలుపులు ఎప్పటికి తొలగిస్తారో వేచి చూద్దాం.

మలుపులను తొలగించాలి

ఉంగుటూరు మండలంలో ఉన్న ఈ ఆర్‌అండ్‌బీ రహదారిలో మలుపులు ఎక్కువగా ఉన్నాయి. ఇన్ని మలుపులు జిల్లాలో ఏ రహదారిలో లేవు. ఈ మలుపులు తొలగించాలి. ఈ మలుపులవలన ఎన్నో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ప్రమాదాలు నివారించేందుకు హెచ్చరిక బోర్డులు పెట్టాలి. ప్రధానంగా మలుపులు తొలగించాల్సిన బాధ్యత ప్రభుత్వం పై ఉంది. ఈ ప్రయత్నం చేసి మలుపుల దారిని మంచి రహదారిగా మార్చాలి.

– బండారు నాగరాజు, ఎంపీటీసీ, నారాయణపురం



రాచూరు గ్రామంలో ఉన్న ప్రమాదకర మలుపు



తోకలపల్లి మురుగు కోడు వద్ద ఇలా..

విద్యార్థులకు పలకల పంపిణీ

టి.నరసాపురం: మండలంలోని బంజారా భజరంగీ భేరి సంఘం ఆధ్వర్యంలో కృష్ణాపురం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం విద్యార్థులకు సంఘ నాయకులు పలకలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జరబల చందా నాయక్, ధరావత్ రవి నాయక్, భూక్యా సర్వేశ్వరరావు, లావుడియా నాగేంద్ర, భూక్యా సత్యం, జరభల యుగంధర్, హసావత్ వెంకటేశ్వరరావు, హసావత్ రావమ్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

వయో వృద్ధులకు ప్రత్యేక చట్టాలు

పెదపాడు: వయో వృద్ధుల సంక్షేమం, పరిరక్షణ కోసం కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చట్టాలు చేసిందని సీనియర్ సివిల్ జడ్జి కె.రత్నప్రసాద్ తెలిపారు. ఏలూరులోని కొప్పుల వెలమ కల్యాణ మండపంలో ప్రపంచ వయో వృద్ధుల వేధింపుల అవగాహన దినోత్సవం పురస్కరించుకొని ఏర్పాటు చేసిన సమావేశంలో పలు అంశాలను వివరించారు. వీటిని ప్రజలకు వివరించేందుకు ప్రభుత్వం దేశ, రాష్ట్ర, జిల్లా, మండల స్థాయిలో లీగల్ సెల్ సలహాలు అందిస్తారని చెప్పారు. న్యాయవాది రత్నరాజు మాట్లాడుతూ వృద్ధాప్యంలో తల్లిదండ్రులను చూడాల్సిన బాధ్యత పిల్లలపై ఉందని, దీనిపై ప్రభుత్వం చట్టం చేసినట్లు తెలిపారు.